క్లుప్తంగా

దయా గుణం కలిగి ఉండాలి


ప్రసంగిస్తున్న ఇస్కాన్ ధర్మ ప్రచారకులు

వెలుగోడు: భగవంతునిపై అపారమైన భక్తి, నమ్మకంతోపాటు, ప్రతిఒక్కరిపై దయకలిగి ఉండాలని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతప్త దాస్ జీ సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, భజన, గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండు

ఆత్మకూరు: క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్‌హక్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో శుక్రవారం సీఐ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన అబ్దుల్‌హక్ ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ప్రశాంత జీవనం గడపండి

కొత్తపల్లి: గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కపిలేశ్వరం, పాత మాడుగుల, సిద్దేశ్వరం గ్రామాల్లో ఎస్‌ఐ ఎం.కేశవతో కలసి పర్యటించారు. ప్రజలతో సమావేశాలు నిర్వహించి గొడవల జోలికి వెళ్లొద్దని సూచించారు.

శ్రీశైలంలో ఆయుధపూజ


దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ కమీషనర్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిల్టర్‌బెడ్ వద్ద శుక్రవారం ఆయుధపూజ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల, దుర్గాదేవి చిత్రపటాలకు పూజలు జరిపారు. అనంతరం నీటిసరఫరా పనిముట్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు పాల్గొన్నారు.

● **పోలీస్ స్టేషన్లలో..**

వెలుగోడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి దుర్గాష్టమి పూజలు ఎస్‌ఐ విష్ణునారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీసులు సాంప్రదాయ దుస్తులతో పూజల్లో పాల్గొనగా పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ అష్టదిగ్పాలక, గణపతి, వాస్తు నవగ్రహ దుర్గ పూజలు చేయించారు. గ్రామానికి సంబంధించిన బల్లెం, తుపాకులు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఏఎస్‌ఐ శేషావలి, పోలీసులు పాల్గొన్నారు

● **కొత్తపల్లి:** దసరా దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.కేశవ ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. పురోహితులు యాదవేని లక్ష్మీనరసయ్య శర్మ స్టేషన్‌లోని రికార్డులను దేవతామూర్తుల పటాల ముందు ఉంచి ఆయుధ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సరస్వతి, లక్ష్మీ, పార్వతి, దుర్గామాత దేవిలకు విశేష పూజలు నిర్వహించారు.

● **పోలీసు స్టేషన్లలో ..**

మిడుతూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో దుర్గాష్టమిని పురస్కరించుకుని ఎస్‌ఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

టీడీపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

నందికొట్కూరు: స్థానిక 2వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌తోపాటు మరో ఐదుగురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన షేక్ జిలానీ తన 5 సెంట్ల స్థలంలో జియో సెల్ టవర్ నిర్మాణానికి నెలకు రూ.5 వేల చొప్పున బాడుగకు ఇచ్చాడు. జియో సంస్థ టవర్ నిర్మాణానికి చేర్యలు చేపట్టగా కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుసేన్ అతని అనుచరులు షఫి, కరీం, రఫి, రసూల్, మన్సూర్ కలిసి గురువారం అడ్డుకునేందుకు యత్నించారు. సంస్థ యాజమాన్యం నిర్మాణ పనులు కొనసాగించడంతో జీర్ణించుకోలేని కౌన్సిలర్ జాకీర్ హుసేన్ అతని స్నేహితులు.. అక్కడే ఉన్న స్థలం యజమాని షేక్ జిలానీబాషా కుమారుడు ముక్తాలిఫ్‌పై దాడి చేశారు. రక్త గాయాలు కావడంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతి

అవుకు: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకట కృష్ణయ్య(55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన సంజామల మండలం ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దసరా సెలవులు కావడంతో ఇంటి దగ్గరే ఉన్న ఆయన హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు. భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నందికొట్కూరు: వాసవి కన్యకా పరమేశ్వర ఆలయంలోని అమ్మవారు మహిషాశుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించుకున్నారు.



మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ ఆయయాల్లోని అమ్మవార్లను అర్చకులు మహిశాసురమర్ధిని రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, విష్ణు సహస్ర పారాయణంతోపాటు లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.



కొత్తపల్లి: దసర ఉత్సవాల్లో భాగంగా దేవీశరన్నవరాత్రుల్లో తొమ్మిదవ రోజు శుక్రవారం కొలనుభారతిదేవి అమ్మవారిని పురోహితులు మహిషాసురమర్ధినిదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



బండిఆత్మకూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగ ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో గంగాఉమాదేవి అమ్మవారు దసరా శరన్న వరాత్రులలో భాగంగా శుక్రవారం మహిషాసురమర్ధిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కరుణించవమ్మా.. మహిషాశురమర్ధినీ!

జూపాడుబంగ్లా: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించడం వల్ల అమ్మవారికి మహిషాసురమర్ధినిగా పేరు గాంచారు. ఈ అమ్మవారిని కొలిచిన వారికి భయం తొలగిపోయి, సర్వరోగాలు, పాపాలు హరించిపోతాయని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం, మహాచండీ యాగం వంటి విశేషపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్, విద్యుత్ ఉపకేంద్రం కార్యాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



తాటిపాడు శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మహిషాసురమర్ధినిగా అమ్మవారు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేస్తున్న భక్తులు


పాములపాడులో..

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ మాతా ఆలయంలో శుక్రవారం మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు గణపతి పూజ, కుంకుమార్చన, పుష్పార్చన, సహస్రనామావళి, పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహ/ంచారు. భక్తులు అమ్మవారికి కాయ ,కర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


ఆత్మకూరులో మహిషాసురమర్ధినిగా..

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిషాసురమర్ధినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి భక్తులు కుంకుమార్చనలు, హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భజనలు నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారితోపాటు శివాలయాల్లోని పార్వతీమాత, అంబాభవానీ ఆలయాల్లో మహిషాసురమర్ధినిగా అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

● **రావణ వాహనంపై సిద్ధిధాత్రి దుర్గ**


మహానందిలో ..

మహానంది: మహానందిలోని కామేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేపట్టారు. సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో కొలువైన అమ్మవారికి రావణవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో ఏఈఓ వై.మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


వెలుగోడులో మహాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వేల్పనూరులోని అంకాల పరమేశ్వరిదేవి ఆలయంలో సిద్ధి ధాత్రి దేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించి పూజించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

జూపాడుబంగ్లా: ఎన్నికల హామీలు నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాహాయం, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు తదితర హామీలిచ్చి అధికారం చేట్టిన కూటమి నాయకులు ఒక్కటీ నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్ణ, గోపాలకృష్ణ, రాము, రంగమ్మ, శివ, మణికంఠ, కుమార్, లోకారెడ్డి, మస్తాన్, సువర్ణమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు

క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రచురించిన 2025 క్యాలెంటర్, పంచాంగాలను శుక్రవారం అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచన మండపంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు.




మామిడాకులను కొంటున్న ప్రజలు


బంతిపూలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

పండగ సందడి

నందికొట్కూరు: మండల కేంద్రంలో పండగ శుక్రవారం పండగ సందడి కనిపించింది. శనివారం దసరా ఉండటంతో మండల కేంద్రం ప్రజలతోపాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చి పూజాసామగ్రి, పండగ సంత కొనుగోలు చేశారు. పటేల్ సెంటర్‌లో మామిడాకులు, బంతిపూలు తదితర పూజా సామగ్రి కొనుగోలుకు ప్రలు పోటీ పడ్డారు. బంతి పూల ధర కిలో రూ.100 నుంచి రూ.150 పలికింది. కాగా పూజా సామగ్రితోపాటు నిత్యాసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పండగ కాబట్టి కచ్చితంగా కొనాల్సి వస్తుందన్నారు.

మహానందిలో భక్తజనసందడి

మహానంది: దసరా సెలవులు, మహర్నవమి ఉండటంతో మహానంది ఆలయం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా కనిపించాయి. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

పంట నమోదు వివరాలు సరిచూసుకోండి

వెలుగోడు: మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో ఖరీఫ్–2024 పంట వివరాలను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారని, రైతులు పంట నమోదు వివరాలు సరిగా ఉన్నాయో, లేదో పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల నమోదు పూర్తి అయిందని, రైతుల జాబితా ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రైతు సేవ కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రతి రైతు తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. పేరు, విస్తీర్ణం, పంట, నీటి వసతి తదితర వివరాలలో పొరపాట్లు ఉంటే అర్జీ అందజేసి రైతు సేవా కేంద్రం సిబ్బందితో సరిచేసుకోవాలన్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'

కొత్తపల్లి: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి శుక్రవారం తెలిపారు.

కేసు నమోదు

మిడుతూరు: పొలంలో ఎద్లను మేపడమే గాక ప్రశ్నించినందుకు రాయితో దాడి చేసిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన రహిమహిస్ పొలంలోని పైరును అదే గ్రామానికి చెందిన బోయ శంకర్ ఎద్దులు మేస్తున్నాయి. దీంతో రహిమాన్.. శంకర్ ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తుడై శంకర్ రాయితో రహిమాన్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపారు.

కారు, బైకు ఢీ

● ఒకరికి గాయాలు

బండిఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. మైసూర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఇన్నోవా కారు.. రేగడగూడూరు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న బైకు బండిఆత్మకూరు సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న షేక్షా తలకు బలమైన గాయం కావడంతో వైద్యం కోసం నంద్యాల శాంతిరాం జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా డ్రైవర్ ప్రమోద్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

శ్రీశైలంప్రాజెక్ట్: అభివృద్ధి–సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతిఒక్కరికీ మౌలిక వసతులు కల్పిస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం సున్నిపెంట జెన్‌కో అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.20 కోట్లతో, సున్నిపెంటలో రూ.3 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించబోతున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. నెలలో ఒకరోజు పరిష్కారవేదిక నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుంటానన్నారు. అంతకు ముందు సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి అక్కడి సమస్యలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

వీధి దీపాల ఏర్పాటు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీలో సర్పంచు వరప్రసాద్ వీధి బల్బులు శుక్రవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా రాత్రిళ్లు ప్రజలు బయట తిరిగే అవకాశముండటంతో తుమ్మలూరు, క్రిష్టారావుపేట గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రయాణం.. నరకం

పల్లె రోడ్లపై ప్రయాణం అంటేనే నరకం కనిపిస్తోంది. ఏ రహదారి చూసినా గుంతల మయమై రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా మరమ్మతులు చేయించాలనే ధ్యాస కూడా ప్రజాప్రతినిధులుకు, అధికారులకు లేకపోవడంపై ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

● గుంతల మయంగా పల్లె రహదారులు
● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


కడుమూరు- పైపాలెం గ్రామాల మధ్య దెబ్బతిన్న బీటీ రోడ్డు


అధ్వానంగా ఉన్న మిడుతూరు- పీరుసాహెబ్ పేట రహదారి

మిడుతూరు: మండల కేంద్రం నుంచి గార్గేయపురం మీదుగా కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో పీరుసాహెబ్ పేట, కడుమూరు గ్రామాల మధ్య బీటీ రహదారి గుంతల మయంగా మారింది. కడుమూరు నుంచి ఓర్వకల్లు వెళ్లే దారిలో చౌట్కూరు, 49– బన్నూరు గ్రామాల మధ్య రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిడుతూరు నుంచి చింతలపల్లి, ఖాజీపేట మధ్య దెబ్బతిన్న రహదారి, దేవనూరు నుంచి సున్నంపల్లి వెళ్లే రహదారి, దేవనూరు నుంచి – గుడిపాడు, చౌట్కూరు, ఓర్వకల్లు వరకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. కడుమూరు – పైపాలెం, నాగలూటి గ్రామాల మధ్య బీటీ రహదారి అధ్వానంగా ఉంది. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. చెరుకుచెర్ల గ్రామం నుంచి బైరాపురం, తిమ్మాపురం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల వరకు వెళ్లే రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జి ఉండటంతో భారీ వర్షాలకు కాకిలేరు ఉధృతికి ఎద్దుల బండి, వ్యక్తులు గల్లంతైన ఘటనలు ఉన్నాయి.

నందికొట్కూరు – నంద్యాల రహదారి కూడా..

నందికొట్కూరు- నంద్యాల వెళ్లే ప్రధాన రహదారిలో మిడుతూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద నుంచి సుంకేసుల బాట వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా పాడైపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారిలో గడివేముల మండలం జిందాల్ వెళ్లే లారీలు అధిక లోడ్‌తో రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి పూర్తిగా దెబ్బతింది. జిందాల్ కంపెనీ నుంచి అధిక లోడ్‌తో ముడిసరుకులు రవాణా చేసుకోవడానికి గడివేముల నుంచి నంద్యాలకు ప్రత్యేకంగా రోడ్డు వేసుకున్నారు. నంద్యాల మీదుగా ఈ వాహనాలు వెళ్లకుండా గడివేముల నుంచి నందికొట్కూరు, మిడుతూరు మీదుగా వెళ్లడంతో రహదారులు తక్కువ వ్యవధిలోనే దెబ్బతింటున్నాయి.

లింకు రోడ్లు ఏర్పాటు చేయండి

మండలంలో కొన్ని గ్రామాల మధ్య గ్రామీణ ప్రాంతాలకు నూతనంగా లింకు రోడ్లు మంజూరు చేయడం ద్వారా కిలోమీటర్ల మేర దూరం తగ్గడంతోపాటు ప్రయాణికులకు ప్రయాస లేకుండా ఒడిదుడుకులు లేకుండా త్వరగా చేరుకోవడానికి వీలు ఉంటుంది. మిడుతూరు నుంచి వీపనగండ్ల, జూపాడుబంగ్లా మండలం (తర్తూరు గ్రామం) మీదుగా నూతన బీటీ రహదారిని మంజూరు చేయడం ద్వారా కేజీ రోడ్డు (కర్నూలు – గుంటూరు రహదారిలో) జూపాడుబంగ్లా మండలం వద్ద హైవే వద్ద చేరుకుంటారు. తిమ్మాపురం, బైరాపురం, వీపనగండ్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు వేయడం ద్వారా దాదాపు 10 కిలోమీటర్ల దూరం తగ్గి నందికొట్కూరు పట్టణానికి త్వరగా చేరుకుంటారు. చౌట్కూరు, 49– బన్నూరు, మాసపేట గ్రామాల మధ్య బీటీ రహదారి వేయడం ద్వారా 7 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కలమందలపాడు నుంచి కనమడకల, ఓర్వకల్లు గ్రామానికి మధ్య రహదారి వేయడం ద్వారా మాసపేట, కలమందలపాడు, ఉప్పలదడియ గ్రామస్తులకు 15 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు ఎయిర్ పోర్టుకు మార్గం సుగమమం అవడంతోపాటు నంద్యాలకు త్వరగా చేరుకుంటారు.

నరకం చూస్తున్నాం

ఏటా వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు రొచ్చు రొచ్చుగా తయారవుతున్నాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లు అభివృద్ధి చేయాలి.
– కురువ రామచంద్రుడు, రోళ్లపాడు గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం

మండలకేంద్రమైన మిడుతూరు నుంచి నంద్యాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు బాగోలేక ఇబ్బందులు పడుతున్నాం. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్ల అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. మండలకేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు లింకు రోడ్లు వేస్తే ప్రయాణం సులువవుతుంది. ప్రస్తుతం అధికారులు, పాలకులు రహదారి నిర్మాణంపై దృష్టి సారించి ప్రజల కష్టాలు తీర్చాలి.
– సిసింద్రి, మిడుతూరు

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

మిడుతూరు మండలంలో నూతన రహదారుల ఏర్పాటు, రహదారుల మరమ్మతులకు సంబంధించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాం. నిధులు విడుదల అయిన వెంటనే టెండర్లు పిలిచి రహదారుల నిర్మాణాలు చేపడతాం.
– మనోహర్, ఆర్‌అండ్‌బీ ఏఈ